

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

గురువారం 19-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :150 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్



ఇందిరమ్మ బీమా షురూ!

- నేడు ఇందిరమ్మ బీమా ప్రారంభం
- కోటి కుటుంబాలకు బీమా భరోసా
- ప్రతి కుటుంబంలో ఒక్కరికే అవకాశం
- మరణిస్తే రూ.5 లక్షల ఆర్థిక సాయం
- 18-59 ఏళ్ల వారికి అర్హత
- గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక కేంద్రాలు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు
- డిసెంబర్ 18 వరకు గడువు



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న సార్వత్రిక జీవిత బీమా పథకం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రేపు సిద్ధిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

సీఎం కుర్చీకి రేవంత్ అనర్హుడు!

- ఏపీ టన్నెల్‌పై కవిత తీవ్ర ఆగ్రహం
- సాగర్ నీటి తరలింపుపై నిలదీత
- రేవంత్‌కు ముందే సమాచారం ఉందా?
- తెలంగాణ నిఘా వ్యవస్థ ఏం చేస్తోంది?
- ప్రభుత్వ మౌనంపై కవిత ఫైర్ 2 లో
- అక్రమ పనులు వెంటనే అడ్డుకోవాలి

కశ్మీర్‌లో ఉగ్రవేట.. కమాండర్ ఖతం!

- కుల్గామ్‌లో భద్రతా బలగాల ఎన్‌కౌంటర్
- లష్కరే టాప్ కమాండర్ లతీఫ్ భట్ హతం
- మసీదులో తలదాచుకున్న ఉగ్రవాది
- లొంగిపోవాలని బలగాల విజ్ఞప్తి
- కాల్పులతో ఎదురుదాడికి దిగిన ఉగ్రవాది
- నవంబర్ 11 దాడిలో కీలక నిందితుడు
- మసీదుకు నష్టం లేకుండా ఆపరేషన్ పూర్తి 2 లో

నీట్ లీక్‌పై కోర్టు కొరడా!



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): దేశంలో సెన్సేషనల్ అయిన నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసుకు సంబంధించి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో మొత్తం 14 మంది నిందితులపై క్రిమినల్ అభియోగాలు నమోదు చేయడానికి న్యాయస్థానం మార్గం సుగమం చేసిందిౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా ఈ విచారణను చేపట్టి, భారతీయ న్యాయ సంహిత, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్, పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్, 2024 అలాగే కాపీరైట్ చట్టంలోని పలు సెక్షన్ల కింద నిందితులపై అభియోగాలు మోపారు.



పథకాల ఖర్చు పెరుగుతున్న భారం!

- నగదు బదిలీలో తెలంగాణ టాప్-2!
- ఏపీకి దేశంలో నాలుగో స్థానం!
- రెండు రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారం!
- తెలంగాణలో రూ.32,629 కోట్ల కేటాయింపు!
- ఏపీలో రూ.33,943 కోట్ల ఖర్చు!
- రైతులు, పింఛన్లకే అధిక నిధులు!
- దేశవ్యాప్తంగా రూ.4 లక్షల కోట్ల కేటాయింపులు!
- ఏటా 24 శాతం పెరుగుతున్న నగదు బదిలీలు!
- అనర్హుల ఏరివేతకు ఆర్థిక సంఘం సిఫారసు!

న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): సంక్షేమ పథకాల కింద ప్రజలకు నేరుగా నగదు బదిలీ చేసే విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దేశంలోనే టాప్‌లో ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రాలు తమ రెవెన్యూ వ్యయంలో నగదు బదిలీ పథకాల కోసం కేటాయించిన నిధుల వాటా ఆధారంగా రూపొందించిన నివేదికలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 15 శాతం కేటాయింపులతో జార్ఖండ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా.. 14 శాతంతో తెలంగాణ, పశ్చిమ బెంగాల్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక 13 శాతం కేటాయింపులతో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది.

మిగతాది 2 లో..

నిధులివ్వకుంటే కురుక్షేత్రమే!

- మునుగోడుకు నిధులేవీ?
- మంత్రి పదవి వద్దు.. నిధులివ్వండి
- కొడంగల్‌కే వేల కోట్లు..
- మునుగోడుకు మొండిచేయి
- ప్రశ్నిస్తే క్రమశిక్షణ చర్యలా?
- ఫ్లోరైడ్ బాధలు కనిపించడం లేదా?



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ అంటే కేవలం కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ మాత్రమేనా?' అని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మునుగోడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన సొంత ప్రభుత్వ తీరు, నిధుల కేటాయింపులో వివక్ష జరుగుతోందంటూ ఆరోపణలు గుప్పించారు.

నిధుల కేటాయింపులో వివక్షపై ఆగ్రహం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలకే ప్రాధాన్యత ఇచ్చారని, అప్పుడు కూడా తాను నిధుల కోసం పోరాడానని రాజగోపాల్ రెడ్డి గుర్తుచేశారు. 2 లో

వాహనమిత్రతో డ్రైవర్లకు పండగ!



- వాహనమిత్రకు రూ.231 కోట్ల విడుదల
- డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.15 వేలు
- ఆటో, క్యాబ్ ఓనర్లకు గుడ్‌న్యూస్
- త్వరలోనే ఖాతాల్లో నగదు జమ 2 లో
- సొంత వాహనం ఉన్నవారికే సాయం
- ప్యాసింజర్ వాహనాలకే పథకం వర్తింపు

సజ్జనార్‌పై కామెంట్స్.. పోలీసుల ఫిర్యాదు!

- సజ్జనార్‌పై పోస్టుతో వివాదం
- ఎక్స్‌కు సైబర్ క్రైమ్ పోలీసుల ఫిర్యాదు
- మాజీ ఐపీఎస్‌కు ఈమెయిల్ నోటీసు
- మహేశ్ భగవత్‌కు నాగేశ్వరరావు ప్రశ్నలు
- చట్ట ఉల్లంఘనపై ఆధారాలేవి?
- మాజీ బాస్‌కు విధేయత చూపుతున్నారా?
- పోలీసుల తీరుపై మాజీ ఐపీఎస్ ఫైర్



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్ మాజీ సీపీ వీసీ సజ్జనార్‌ను ఉద్దేశించి సీబీఐ మాజీ డైరెక్టర్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం.నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. సజ్జనార్‌పై ఆయన చేసిన సోషల్ మీడియా పోస్టుపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చర్యలు కోరుతూ ఎక్స్ సంస్థకు అభ్యర్థన పంపినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఎక్స్ సంస్థ నాగేశ్వరరావుకు ఈమెయిల్ ద్వారా తెలియజేసింది. దీంతో ఈ వ్యవహారం పోలీసు వర్గాల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ చర్చనీయాంశంగా మారింది.

బర్డ్ ఫ్లూకు చెక్.. వ్యాక్సిన్ రెడీ!



- దేశీయంగా తొలి హెచ్5ఎన్1 వ్యాక్సిన్
- నవంబర్ 20న టీకా ఆవిష్కరణ
- వైరస్‌కు చెక్ పెట్టేలా రూపకల్పన
- దేశంలో 500కు పైగా కేసులు
- కోళ్ల మరణాలకు అడ్డుకట్ట 2 లో

గురువు కోసమా.. మోడీ కోసమా?

- సాగర్ నీటి తరలింపుపై కేటీఆర్ ఫైర్
- రేవంత్ కనుసన్నల్లోనే అక్రమ ప్రాజెక్టు?
- ప్రభుత్వానికి తెలియదంటే నమ్మాలా?
- 90 టీఎంసీల నీటి తరలింపుపై ఆగ్రహం
- కేఆర్ఎంబీకి ఫిర్యాదు ఎందుకు చేయలేదు?
- బీజేపీ ఎంపీల మౌనంపై నిలదీత
- తెలంగాణ నీటి హక్కుల కోసం ఉద్యమం



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నాగార్జున సాగర్‌ను తెలంగాణకు దూరం చేసే కుట్ర జరుగుతోందని, జల్ జీవన్ మిషన్ పేరుతో ఏపీ చేస్తున్న నీటి వినియోగానికి కేంద్రం సహకరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన..గతంలోఆంధ్రా పాలకుల కంటే రేవంత్ రెడ్డి పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరుగుతోందని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది రేవంత్ రెడ్డి కానే కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "రోజుకు 18 గంటలు పనిచేసే ముఖ్యమంత్రికి ఏడాదిగా నాగార్జునసాగర్‌లో ఏపీ చేపడుతున్న ప్రాజెక్టు గురించి తెలియదా? ఇంటెలిజెన్స్ అధికారులు, నీటిపారుదల శాఖ సీఈలు సీఎంకు నివేదిక ఇవ్వలేదా? సాక్షాత్తూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత జిల్లా నల్గొండలోనే ఈ అక్రమ ప్రాజెక్టు జరుగుతుంటే ప్రభుత్వానికి సమాచారం లేదా?" అని నిలదీశారు. అధికారులు సమాచారం ఇవ్వలేదా, లేక ఎవరి చెప్పుచేతల్లో ప్రభుత్వం ఉందో భయపడి మౌనంగా ఉన్నారా అని కేటీఆర్ ప్రశ్నించారు. తన అవగాహన మేరకు ప్రభుత్వానికి తెలిసే, రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం నడుస్తోందని ఆరోపించారు.

ఆర్థిక విపత్తు అంచున భారత్ రాహుల్ హెచ్చరిక!

- నిరుద్యోగంతో దేశంలో ఆర్థిక ఆందోళన
- భవిష్యత్తుపై భరోసా లేని యువత
- విద్యావ్యవస్థలో లోతైన లోపాలు
- పరిశ్రమలు, వ్యవసాయం బలహీనత
- తయారీ రంగం బలోపేతం కావాలి 2 లో
- సేవారంగంతోనే ఉపాధి అసాధ్యం
- కొద్దిమంది చేతుల్లోనే సంపద కేంద్రీకరణ

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

గురువారం 19-11-2026

ఆర్థిక విపత్తు అంచున భారత్.. రాహుల్ హెచ్చరిక!



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): రెండు రోజుల అమెరికా పర్యటనలో ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం మరియు విద్యావ్యవస్థలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో తీవ్రమైన నిరుద్యోగ సమస్య నెలకొందని, భారత్ ప్రస్తుతం ఒక 'ఆర్థిక విపత్తు' అంచున కూర్చుని ఉందని ఆయన వ్యాఖ్యానించారు. భారత యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై మోడరేటర్ లిడియా పోల్‌గ్రీన్ అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ బదులిస్తూ.. "నిజం కఠినంగా ఉన్నా చెప్పక తప్పదు.. భారత్ ప్రస్తుతం ఒక ఆర్థిక విపత్తుపై కూర్చుని ఉంది. మీడియా దీనిని పక్కన పెట్టవచ్చు, కొందరు విస్మరించవచ్చు. కానీ దేశంలో తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఉంది.

అలాగే మన విద్యావ్యవస్థలో లోతైన సమస్యలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. చదువుకున్న మధ్యతరగతి యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని, తమకు భవిష్యత్తు కనిపించకపోవడమే దీనికి ప్రధాన కారణమని రాహుల్ వివరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత తమ తల్లిదండ్రుల సలహాలను కూడా ప్రశ్నించే పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివని, కానీ నేడు ఆ వెన్నెముక విరిగిపోయిందని రాహుల్ విమర్శించారు. కేవలం సేవా రంగం ద్వారా అందరికీ ఉద్యోగాలు కల్పించడం అసాధ్యమని, తయారీ రంగాన్ని బలోపేతం చేయకపోతే దేశం మనుగడ సాగించడం కష్టమని అభిప్రాయపడ్డారు. కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తల వద్దే సంపద కేంద్రీకృతమవుతోందని ఆయన ఆరోపించారు.

నిధులివ్వకుంటే కురుక్షేత్రమే!

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం కూడా అదే పరిస్థితి కొనసాగుతోందని, రేవంత్ రెడ్డి కొడంగల్ అని, ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అని, భట్టి విక్రమార్క మధిర అని ఎవరి నియోజకవర్గాల గురించే వారు ఆలోచిస్తున్నారని ఆయన విమర్శించారు. నా బతుకంతా పోరాటమేనని, తనకు మంత్రి పదవి లేకపోయినా పర్లేదని, పదవుల్లో మీరే ఉండండని పార్టీ నేతలకు చెప్పానని రాజగోపాల్ రెడ్డి అన్నారు. పేర్కొన్నారు. తన మునుగోడు నియోజకవర్గానికి నిధులు అడిగితే తప్పేంటని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌కు రూ.10 వేల కోట్లు తీసుకెళ్తామంటున్నారని, కానీ ఫ్లోరైడ్ నీటితో విషం తాగుతున్న మునుగోడు ప్రజల కోసం చెరువులు, కుంటల అభివృద్ధికి కనీసం రూ.500 కోట్లు కూడా ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిండి ఎత్తిపోతల పనులు మొదలుకాక మూడేళ్లు గడుస్తోందని, ప్రాజెక్టును పడావు పెట్టి నల్లగొండ జిల్లాను చంపుతున్నారని మండిపడ్డారు. చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడాన్ని రాజగోపాల్ రెడ్డి ప్రస్తావించారు.

పార్టీ క్రమశిక్షణ పేరుతో కట్టడిపై ఫైర్..

నియోజకవర్గ సమస్యలపై నాలుగు గోడల మధ్య వినతిపత్రాలు ఇస్తే పట్టించుకోవడం లేదని, అదే బయట వేదికలపై మాట్లాడితే పార్టీ క్రమశిక్షణ పేరుతో కట్టడి చేయాలని చూస్తున్నారని రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ నిధులపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్ రెడ్డి 'పండబెట్టి తొక్కుతా' అంటున్నారని ఆరోపించిన ఆయన, "ఈయనేం ముఖ్యమంత్రి? ఆ భాష ఏంటి?" అంటూ ఘాటుగా విమర్శించారు. తండ్రి పాత్ర పోషించాల్సిన ముఖ్యమంత్రి ప్రాంతాల మధ్య వివక్ష చూపడం సరికాదని రాజగోపాల్ రెడ్డి హితవు పలికారు.

నిధులు ఇవ్వకపోతే మరో కురుక్షేత్రమే..

ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేకపోతున్నారో ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రాజగోపాల్ రెడ్డి అన్నారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా మునుగోడుకు రావాల్సిన నిధులు విడుదల చేయకపోతే 'మరో కురుక్షేత్రం' తప్పదని ప్రభుత్వానికి ఆయన గట్టి హెచ్చరిక జారీ చేశారు.

సజ్జనార్‌పై కామెంట్స్.. పోలీసుల ఫిర్యాదు!

మొదటి పేజీ తరువాయి

సజ్జనార్‌పై పోస్టు.. ఎక్స్‌కు పోలీసుల ఫిర్యాదు!:

ఇటీవల సజ్జనార్‌ను ఉద్దేశించి నాగేశ్వరరావు తన ఎక్స్ ఖాతాలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనను 'యూనిఫామ్ వేసుకున్న నేరస్తుడు'గా అభివర్ణిస్తూ పోస్టు పెట్టారు. ఈ పోస్టు భారతీయ చట్టాలను ఉల్లంఘిస్తోందని పేర్కొంటూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం నుంచి తమకు అభ్యర్థన అందిందని ఎక్స్ సంస్థ నాగేశ్వరరావుకు పంపిన ఈమెయిల్‌లో వెల్లడించింది. ప్రభుత్వ లేదా చట్ట అమలు సంస్థల నుంచి కంటెంట్ తొలగించాలని అభ్యర్థన వచ్చినప్పుడు వినియోగదారులకు సమాచారం అందించడం తమ విధానమని స్పష్టం చేసింది. ఈ అభ్యర్థనను కోర్టులో సవాలు చేయడం, న్యాయ సలహా తీసుకోవడం లేదా ఇతర మార్గాలను పరిశీలించుకోవచ్చని సూచించింది.

మహేశ్ భగవత్‌కు నాగేశ్వరరావు ప్రశ్నలు:

ఎక్స్ నుంచి ఈమెయిల్ నోటీసు రావడంపై నాగేశ్వరరావు ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ వ్యవహారంపై ప్రస్తుత హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్‌ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. తన పోస్టు భారతీయ చట్టంలోని ఏయే నిర్దిష్ట సెక్షన్లను ఉల్లంఘించిందో సంబంధిత పోలీసు అధికారులతో స్పష్టం చేయించాలని కోరారు. కేవలం చట్టాలను ఉల్లంఘించిందని పేర్కొనడం కాకుండా, అందుకు సంబంధించిన చట్టపరమైన ఆధారాలను వెల్లడించాలని పరోక్షంగా ప్రశ్నించారు.

మాజీ బాస్‌పై విధేయత చూపుతున్నారా?

ఈ సందర్భంగా నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తించాయి. సంబంధిత పోలీసు అధికారులు చట్టం పట్ల కాకుండా తమ మాజీ బాస్ (సజ్జనార్) పట్ల ఎక్కువ విధేయత చూపుతున్నట్లు కనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. చట్టబద్ధమైన పోలీసింగ్‌ను నిర్ధారించే విషయంలో ప్రస్తుత పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మొత్తంగా మాజీ సీపీ సజ్జనార్‌పై మాజీ ఐపీఎస్ నాగేశ్వరరావు చేసిన పోస్టు, దానిపై సైబర్ క్రైమ్ పోలీసుల అభ్యర్థన, ఎక్స్ సంస్థ ఈమెయిల్ నోటీసు, ప్రస్తుత సీపీకి నాగేశ్వరరావు సంధించిన ప్రశ్నలతో ఈ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

బర్డ్ ఫ్లూకు చెక్.. వ్యాక్సిన్ రెడీ!

న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): భారత్‌లో కోళ్ల పరిశ్రమను బర్డ్ ఫ్లూ ముప్పు నుంచి కాపాడటానికి దేశీయంగా అభివృద్ధి చేసిన మొట్టమొదటి హెచ్5ఎన్1 వ్యాక్సిన్‌ను నవంబర్ 20న అధికారికంగా ఆవిష్కరించనున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ నూతన వ్యాక్సిన్‌ను జాతికి అంకితం చేయనున్నారు. ఈ వ్యాక్సిన్‌ను భోపాల్‌లోని ప్రఖ్యాత 'ఐకార్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్' సంస్థ అభివృద్ధి చేసింది. మన దేశంలో కోళ్ల పరిశ్రమను ఎక్కువగా ప్రభావితం చేస్తున్న హెచ్5ఎన్1 క్లేడ్ 2.3.2.1ఏ రకానికి చెందిన వైరస్‌ను సమర్థవంతంగా అడ్డుకునేలా ఈ ఇనాక్టివేటెడ్' వ్యాక్సిన్‌ను ప్రత్యేకంగా రూపొందించారు.

దేశంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి కారణంగా గతంలో కోళ్ల భారీ సంఖ్యలో మరణించడం, దీంతో పౌల్ట్రీ రంగానికి కోట్లాది రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లడం జరిగింది. ముఖ్యంగా 2006 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 500కి పైగా బర్డ్ ఫ్లూ కేసులు వెలుగుచూశాయి. ఈ స్వదేశీ వ్యాక్సిన్ అందుబాటులోకి రావడం ద్వారా పౌల్ట్రీ రంగాన్ని, కోళ్ల పెంపకంపై ఆధారపడే రైతుల జీవనోపాధిని భద్రపరచవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఈ వ్యాక్సిన్ కేవలం ఆర్థిక పరమైన రక్షణే కాకుండా, ప్రజా ఆరోగ్య భద్రతకు కూడా ఎంతగానో దోహదపడనుంది. బర్డ్ ఫ్లూ వ్యాధి పక్షులకే కాకుండా కొన్ని సందర్భాల్లో ఇతర జంతువులకు, మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం 2003 నుంచి ఇప్పటివరకు 25 దేశాలలో హెచ్5ఎన్1 మానవ కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, వైరస్‌ను మూలంలోనే అణచివేసి భవిష్యత్తులో రాబోయే ప్రమాదాలను ముందస్తుగా నివారించడానికి ఈ స్వదేశీ వ్యాక్సిన్ ఎంతగానో ఉపయోగపడనుంది.

కశ్మీర్‌లో ఉగ్రవేట.. కమాండర్ ఖతం!



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): జమ్మూ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో లష్కర్-ఇ-తొయిబా ఉగ్రవాది లతీఫ్ భట్ హతమయ్యాడు. ఒక మసీదులో తలదాచుకున్న అతడు, లొంగిపోవాలని కోరిన భద్రతా బలగాలపై కాల్పులు జరపడంతో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లుగా అధికారులు వెల్లడించారు. కాగా, గతంలో కుల్గామ్‌లోని అఖ్రాన్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడుల్లో లతీఫ్ భట్ కీలక నిందితుడిగా ఉన్నాడు. నవంబర్ 11న ఇక్కడ జరిగిన సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్టు ఉగ్రదాడిలో ముగ్గురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ఈ దాడిలో లతీఫ్ భట్‌తో పాటు మరో ఉగ్రవాది ఉమర్ నిసార్ దార్ ప్రమేయం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టగా, లతీఫ్ భట్ స్థానిక మసీదులో నక్కినట్లుగా తేలింది.

ఓపికతో ఉన్న భద్రతా బలగాలు..

ఈ ఆపరేషన్ సమయంలో భద్రతా బలగాలు ఎంతో సంయమనం పాటించాయి. ఎన్‌కౌంటర్‌కు ముందు పోలీసులు అతడితో నేరుగా మాట్లాడేందుకు ప్రయత్నించి, వీడియో కాల్ ద్వారా 'మేము నీతో ఉన్నాం, లొంగిపో' అని కోరారు. అయితే, అతడు లొంగిపోయేందుకు నిరాకరిస్తూ తాను అల్లాను కలుసుకోవాలని ఉందని, ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పినట్లుగా అధికారులు తెలిపారు. చివరకు లొంగిపోకుండా బలగాలపైకి అతడు కాల్పులకు దిగడంతో, భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో లతీఫ్ భట్ అంతమయ్యాడు. ఈ మొత్తం ఆపరేషన్‌లో పవిత్రమైన మసీదుకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా భద్రతా బలగాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించడం విశేషం.

ఇందిరమ్మ బీమా షురూ!

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక కేంద్రాలు.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నమోదు:

పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ విధానంతో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న నేతన్న, గౌడ, కార్మిక, మత్స్యకారులకు సంబంధించిన రూ. 2 లక్షల బీమా పథకాలను 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'లో విలీనం చేస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు.

ఒక కుటుంబంలో ఒకరికే అవకాశం.. రూ. 5 లక్షల బీమా:

ఈ పథకం కింద రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. ప్రతి కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తి పేరిట జీవిత బీమాను నమోదు చేస్తారు. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నప్పటికీ, కేవలం ఒక్కరికి మాత్రమే బీమా చేయించుకునే అవకాశం ఉంటుంది. ఎవరిని నమోదు చేయించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవాలి. బీమా నమోదైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందుతుంది.

అర్హతలు, గడువు వివరాలు ఇవే:

వయోపరిమితి: ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన (అంటే 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించినవారు) సంపాదించే వ్యక్తుల్లో ఒకరిని నమోదు చేయాలి.

ధ్రువీకరణ: జనన ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకుంటారు. బీమా పొందిన వ్యక్తి పాలసీ కాలంలో గరిష్ఠ వయోపరిమితిని (59 ఏళ్లు) దాటినప్పటికీ, కనీసం ఒక సంవత్సరం పాటు పూర్తి బీమా కవరేజీ లభిస్తుంది.

నమోదు గడువు: దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ నేటి నుంచే ప్రారంభమై, డిసెంబర్ 18 లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ధీమా కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం చేశారు.

నీట్ లీక్‌పై కోర్టు కొరడా!

మొదటి పేజీ తరువాయి

ఈ కేసుకు సంబంధించి నవంబర్ 21న నిందితులందరినీ కోర్టు ఎదుట నేరుగా హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు. అదే రోజు నిందితులపై అధికారికంగా అభియోగాలు ఖరారు కానున్నాయి. అలాగే, నవంబర్ 25 నుంచి ఈ కేసు విచారణను ప్రతిరోజూ నిరంతరం కొనసాగించనున్నట్లు కోర్టు స్పష్టం చేసింది.

కాగా, వైద్య విద్య ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్-యూజీ పరీక్షా పత్రం లీక్ అయిందనే ఆరోపణలతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. దీనిపై సీబీఐ దర్యాప్తు చేపట్టి దాదాపు 20 వేల పేజీలతో కూడిన భారీ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. ఈ కుంభకోణంలో నిందితులుగా ఉన్న 14 మందిపై ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణ వేగవంతమైంది.

సీఎం కుర్చీకి రేవంత్ అనర్హుడు!



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుండి అక్రమంగా నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం భారీ టన్నెల్ ప్రాజెక్ట్ చేపట్టినా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని టీఆర్ఎస్ అధినేత్రి కవిత ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితోనే ఏపీ ప్రభుత్వం ఈ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టిందా? అని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం ఇంత భారీ ఎత్తున ప్రాజెక్టు పనులు చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదా? అని అడిగారు.

అదే నిజమైతే మన నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నట్టు!? అంటూ ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై కనీస సమాచారం లేదంటే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఒక్క క్షణం కూడా పదవిలో ఉండడానికి అర్హుడు కాడంటూ ఫైర్ అయ్యారు. వెంటనే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి.. ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ చేపట్టిన అక్రమ ప్రాజెక్టు పనులను అడ్డుకునేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు.

వాహనమిత్రతో డ్రైవర్లకు పండగ!



న్యూస్ డెస్క్, 18 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలోని ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఓనర్లకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వాహనమిత్ర పథకానికి సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన డ్రైవర్లకు ప్రతి ఏడాది అందజేస్తున్న రూ.15వేల ఆర్థికసాయం కోసం రూ.231 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో త్వరలోనే ఈ డబ్బులు నేరుగా డ్రైవర్లు, ఓనర్ల ఖాతాలలో జమ కానున్నాయి. ఈ స్కీమ్‌కు సంబంధించి ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను సైతం జారీ చేసింది.

ఈ ఆర్థికసాయం కేవలం సొంతంగా ఆటో లేదా క్యాబ్ నడుపుకుంటూ, ఆ వాహనానికి రిజిస్టర్డ్ యజమానిగా ఉన్న డ్రైవర్లకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అంతేకాకుండా కేవలం ప్యాసింజర్ వాహనాలకే ఈ పథకం వర్తిస్తుందని, ఇతర గూడ్స్ వాహనాల డ్రైవర్లకు ఈ పథక వర్తించదని స్పష్టం చేసింది. అర్హత ఉన్న డ్రైవర్ల ఖాతాల్లో ఈ పథకం కింద డబ్బులు జమ చేసేందుకు రవాణాశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆటో, క్యాబ్ డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురువు కోసమా.. మోడీ కోసమా?

మొదటి పేజీ తరువాయి

"గురువు గారి (చంద్రబాబు) కోసమో, మోడీ గారి కోసమో భయపడి తెలియనట్టు నటిస్తున్నారని మాకు అనుమానం కలుగుతోంది. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం మౌనం పాటిస్తోందా? అని ఆయన ప్రశ్నించారు.

కేఆర్ఎంబీకి ఫిర్యాదు ఎందుకు చేయలేదు?

రాష్ట్రంలో బోర్లు వేస్తున్నా నీళ్లు పడటం లేదని, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు తాగునీటి సంక్షోభం పొంచి ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి అవసరాలకే నీటి కొరత ఏర్పడుతున్న సమయంలో 90 టీఎంసీల నీటిని తరలించే ఏపీ ప్రయత్నాలను ఎలా సమర్థిస్తారు? అని నిలదీశారు. తెలంగాణకు మిగిలిన 40 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని, ఏపీ అక్రమ తరలింపును అడ్డుకోవాలని కేఆర్ఎంబీ కి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు లేఖ రాసిందా? అని ప్రశ్నించారు. అక్టోబర్‌కు ముందే మేల్కొని కేఆర్ఎంబీ వద్ద నిరసన ఎందుకు తెలపలేదు? కేఆర్ఎంబీలో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకుండా పోయిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ జలదోపిడీని అడ్డుకోకపోతే హైదరాబాద్‌కు నీటి కష్టాలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ ఎంపీల మౌనంపై నిలదీత

తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఉన్నారని, రాష్ట్ర నీటి దోపిడీ జరుగుతుంటే వారెందుకు మౌనంగా ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు తక్షణమే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఏపీ చేపడుతున్న అక్రమ ప్రాజెక్టును నిలిపివేసేలా కేఆర్ఎంబీకి ఆదేశాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఏపీలో క్రాప్ హాలిడే లేనప్పుడు తెలంగాణ రైతులకు క్రాప్ హాలిడే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కృష్ణా జలాల విషయంలో తొలిసారి అన్యాయం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, వారి నిర్వాకం వల్లే నల్గొండకు ఫ్లోరైడ్ సమస్య, పాలమూరుకు కరువు, వలసలు వచ్చాయని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకున్నది కూడా కాంగ్రెస్ నేతలేనన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే పాలమూరులో 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, ఇతర జిల్లాల నుంచి తిరిగి వలసలు వచ్చేలా మార్చామని తెలిపారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ నష్టాన్ని పూడ్చేందుకు కేసీఆర్ తుమ్మిళ్ల లిఫ్ట్ నిర్మించి ఆర్డీఎస్ ఆయకట్టును కాపాడారని వివరించారు.

ప్రజా ఉద్యమానికి శ్రీకారం

రేవంత్ రెడ్డికి రాజకీయ మొహమాటాలు ఉండొచ్చేమో కానీ, తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్‌కు ఎలాంటి మొహమాటాలు లేవని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుంటే, ఏపీ ప్రభుత్వం తాబేదారులను అడ్డం పెట్టుకొని మన వనరులను కొల్లగొడుతోందని ఆరోపించారు. సాగర్‌ను ఇష్టానుసారంగా దోచుకుంటామంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. తక్షణమే కేఆర్ఎంబీకి బీఆర్ఎస్ తరఫున లేఖ రాస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు. త్వరలోనే నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించి రైతులు, ప్రజలను జాగృతం చేస్తామని, ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని కేటీఆర్ తేల్చిచెప్పారు.

పథకాల ఖర్చు పెరుగుతున్న భారం!

మొదటి పేజీ తరువాయి

2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 128 నగదు బదిలీ పథకాల కోసం రూ.32,629 కోట్లు కేటాయించింది. ఈ మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడుల్లో 14 శాతానికి సమానం. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదే తరహా పథకాల కోసం రూ.33,943 కోట్లు కేటాయించింది. ఇది ఆ రాష్ట్ర రెవెన్యూ రాబడుల్లో 13 శాతంగా ఉంది. తెలంగాణ కేటాయింపుల్లో రైతుల కోసం రూ.18 వేల కోట్లు.. సామాజిక భద్రతా పింఛన్ల కోసం రూ.14,629 కోట్లు ఉన్నాయి. ఏపీలో సామాజిక భద్రతా పింఛన్లకు రూ.27,343 కోట్లు.. రైతులకు ఆర్థిక సాయం అందించే పథకాల కోసం రూ.6,600 కోట్లు కేటాయించారు.

నగదు బదిలీ పథకాల కోసం అత్యధికంగా పశ్చిమ బెంగాల్ రూ.47,542 కోట్లు కేటాయించింది. ఆ తర్వాత కర్ణాటక రూ.40,392 కోట్లు, మహారాష్ట్ర రూ.38,549 కోట్లతో ఉన్నాయి. మధ్యప్రదేశ్ రూ.32,059 కోట్లు, తమిళనాడు రూ.19,036 కోట్లు కేటాయించాయి. రెవెన్యూ వ్యయంలో నగదు బదిలీ పథకాలకు కేటాయించిన వాటా రాష్ట్రాలవారీగా చూస్తే.. జార్ఖండ్ 15 శాతం, తెలంగాణ 14 శాతం, పశ్చిమ బెంగాల్ 14 శాతం, ఆంధ్రప్రదేశ్ 13 శాతం, కర్ణాటక 12 శాతం, మధ్యప్రదేశ్ 10 శాతం, మహారాష్ట్ర 6 శాతంగా ఉన్నాయి.

ఈ నగదు బదిలీ పథకాల పరిధిలో మహిళలు, రైతులు, యువతతోపాటు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే సామాజిక భద్రతా పింఛన్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఈ తరహా పథకాల కోసం రాష్ట్రాలు కలిపి సుమారు రూ.4 లక్షల కోట్లు కేటాయించడం గమనార్హం. ఇది దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు ఒక శాతానికి సమానం. 2022-23లో ఈ పథకాల కేటాయింపులు జీడీపీలో 0.6 శాతంగా ఉండగా.. 2026-27 నాటికి ఒక శాతానికి చేరడం గమనార్హం.

మొత్తం కేటాయింపుల్లో దాదాపు 90 శాతం మహిళలకు అందించే ఆర్థిక సాయం, సామాజిక భద్రతా పింఛన్లకే వెళ్తున్నాయి. మహిళలకు ఇచ్చే సాయంలో ఎక్కువ భాగం నెలవారీగా చెల్లించేలా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు. రైతులకు ఇచ్చే సాయం, ఇతర పథకాల మొత్తాలను మాత్రం ఏడాదిలో రెండు లేదా మూడు విడతలుగా అందించే విధానాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు, నగదు బదిలీలపై చేస్తున్న ఖర్చు క్రమంగా పెరుగుతోందని ఈ రిపోర్ట్ వెల్లడించింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ భాగాన్ని మినహాయించి చూస్తే.. 2018-19లో రాష్ట్రాల రెవెన్యూ రాబడుల్లో సబ్సిడీలు, నగదు బదిలీల వాటా 16 శాతంగా ఉండేది. 2023-24 నాటికి అది 21 శాతానికి పెరిగింది.

ఈ కాలంలో నగదు బదిలీల వ్యయం ఏటా సగటున 24 శాతం వృద్ధి చెందింది. ఇదే సమయంలో సబ్సిడీల ఖర్చు వృద్ధి 12 శాతంగా నమోదైంది. అంటే సబ్సిడీలతో పోలిస్తే నగదు బదిలీలపై ప్రభుత్వాల వ్యయం రెండింతల వేగంతో పెరిగిందని నివేదిక విశ్లేషించింది. నగదు బదిలీ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా ఆర్థిక సాయం అందుతున్నప్పటికీ.. వాటి అమలులో కొన్ని సమస్యలు ఉన్నాయని 16వ ఆర్థిక సంఘం అభిప్రాయపడింది. ఈ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండటం, అర్హత ప్రమాణాలు విస్తృతంగా ఉండటంతో లక్ష్మిత వర్గాలకు మాత్రమే ప్రయోజనం చేరేలా చేయడం కష్టమవుతోందని పేర్కొంది.

దీంతో ప్రభుత్వాలపై గణనీయమైన ఆర్థిక భారం పడుతోందని.. అనర్హులకూ ప్రయోజనాలు అందే అవకాశం ఉందని 16వ ఆర్థిక సంఘం అభిప్రాయం వ్యక్తం చేసింది. అందువల్ల లబ్ధిదారుల జాబితాలను హేతుబద్ధీకరించి.. నిజంగా అర్హులైన వారికే పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ నివేదికలో 128 నగదు బదిలీ పథకాలను మాత్రమే గుర్తించి విశ్లేషించారు. దేశవ్యాప్తంగా అమలు అవుతున్న పథకాలన్నింటినీ ఇది పూ

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 19-11-2026

పిట్లంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై శిక్షణ కార్యక్రమం

అర్హులైన కుటుంబాలకు బీమా భద్రతపై అవగాహన కల్పించాలి - ఎంపీడీవో సాయన్న



ఇది కద నిజం ,ఉమ్మడి నిజాంబాద్ జిల్లా , నవంబర్ 18 పిట్లం: పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో సాయన్న ఆధ్వర్యంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పథకం అమలులో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకం ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో వైభవంగా వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం



ఇది కద నిజం :స్వర్ణగిరి దివ్యక్షేత్రంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం, కార్తీక మాస శుక్ల పక్ష నవమి బుధవారం (నవంబర్ 18) నాడు ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రాతఃకాలంలో అర్చక స్వాములు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించి, అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన గోపృష్ట దర్శనాన్ని భక్తులకు చేయించారు. ఉదయం 5:45 గంటలకు వేదమంత్రోచ్ఛారణల మధ్య బంగారుబావి నుండి సువర్ణ బిందె తీర్థమును తీసుకువచ్చి నిత్యారాధనకు సిద్ధం చేశారు. ఉదయం 7 గంటలకు స్వామివారిని మణిమయ స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. కార్తీక మాస ఉత్సవాలలో భాగంగా అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనం నిర్వహించారు. బుధవారం ప్రత్యేకతను పురస్కరించుకుని స్వామివారి దివ్య పాదారవిందములకు 108 బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో, అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ జరిపారు. అనంతరం వైభవ మంటపంలో సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పట్టు పీతాంబరాలు, సుగంధ పుష్పమాలలతో అలంకృతులైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని భక్తులు కనులారా వీక్షించి ఆనంద పరవశులయ్యారు. ఆలయంలో జరిగిన నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా సుమారు 3,000 మందికి పైగా భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం సంధ్యా సమయంలో ఆలయ ధ్వజస్తంభానికి భక్తిశ్రద్ధలతో మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. రాత్రి 6:30 గంటలకు భక్తుల గోవింద నామస్మరణలు, మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య స్వామివారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులైన శ్రీవారికి అర్చకులు వేదమంత్రాలతో అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించగా, భక్తులు నయనానందకరంగా దర్శించుకున్నారు.



నిరాధార వార్తలపై యాదగిరిగుట్ట దేవస్థానం తీవ్ర అభ్యంతరం

సాలగ్రామ స్వర్ణ ఆభరణం భద్రమేనని స్పష్టీకరణ



ఇది కద నిజం, యాదాద్రి : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి సంబంధించి వాస్తవ నిర్ధారణ లేకుండా అసంపూర్ణ సమాచారంతో వార్తలు ప్రచురించడం సమంజసం కాదని ఆలయ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా, ప్రభుత్వం మరియు దేవస్థానం సమన్వయంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న ఈ ఆలయంపై ఎలాంటి వార్తలైనా ప్రచురించే ముందు అధికారిక వివరణ తీసుకోవాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. ?భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పించే బంగారు, వెండి ఆభరణాలను స్వామివారి ఆస్తిగా పరిగణించి, ఆగమ శాస్త్ర విధానాలు, భద్రతా నిబంధనల ప్రకారం రికార్డుల్లో నమోదు చేసి భద్రపరుస్తామని దేవస్థానం తెలిపింది. భక్తులు సమర్పించిన ఆభరణాలన్నింటినీ ఒకేసారి అలంకరించడం సాధ్యం కానందున, ఉత్సవాలు మరియు ఆలయ సంప్రదాయాలను బట్టి వివిధ సందర్భాల్లో స్వామివారికి, ఉత్సవమూర్తులకు అలంకరిస్తామని స్పష్టం చేసింది. ఈ క్రమంలో భక్తులు సమర్పించిన సాలగ్రామ స్వర్ణ ఆభరణం ప్రస్తుతం దేవస్థానంలోనే అత్యంత భద్రంగా ఉందని, దాని వినియోగం లేదా భద్రత విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదని పేర్కొంది. ?స్వామివారి ఆభరణాలు మరియు వాటి రికార్డుల నిర్వహణపై ప్రధానార్చకులు, ఆలయ ఉన్నతాధికారులు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణాధికారుల ద్వారా అన్ని స్థాయిలలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని దేవస్థానం వివరించింది. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమైనదని, నిర్మాణాత్మక విమర్శలు చేసే హక్కు మీడియాకు ఉన్నప్పటికీ, కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉన్న ఆలయ విషయాల్లో ఊహాగానాలతో వార్తలు రాయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ?యాదగిరిగుట్ట క్షేత్రాన్ని దేశంలోని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు మీడియా సహకారం ఎంతో విలువైనదని అధికారులు పేర్కొన్నారు. సంచలనాత్మక ధోరణిలో నిరాధారమైన కథనాలను ప్రచురించకుండా, అందుబాటులో ఉన్న రికార్డులు, అధికారుల వివరణలను పరిశీలించిన తర్వాతే వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని పాత్రికేయ మిత్రులను కోరారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు భక్తులతో పాటు మీడియా ప్రతినిధులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మూటకొండూరు 416 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ



ఇది కద నిజం:యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 416 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాల అభ్యున్నతికి కృషి చేస్తోంది. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో నూతన పెన్షన్లు మంజూరు చేస్తున్నాం. మోటకొండూరు మండలంలో 416 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ పెన్షన్లు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నాం. రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం, రైతు రుణమాఫీ ద్వారా రుణభారం నుంచి విముక్తి కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే పేద కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం, నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మా ప్రభుత్వ లక్ష్యం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజాప్రతినిధిగా, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిరంతరం కృషి చేస్తాను. ఆలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



గౌడ కులస్థుల జీవనాధారంపై దెబ్బకొడితే కఠిన చర్యలు

● ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హెచ్చరిక



ఇది కద నిజం, యాదాద్రి : కొత్త గుండ్లపల్లి గ్రామంలో గౌడ కులస్థుల జీవనాధారమైన తాటి, ఈత చెట్ల వనాన్ని అక్రమంగాయాదగిరిగుట్ట మండలం కొత్త గుండ్లపల్లి గ్రామంలో గౌడ కులస్థుల జీవనాధారమైన తాటి, ఈత చెట్ల వనాన్ని అక్రమంగా తొలగిస్తున్న రియల్టర్ల ఆగడాలపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్పందించారు. గౌడ సంఘం నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ, కొందరు రియల్టర్లు మరియు బ్రోకర్లు ఎక్సైజ్ అధికారుల సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా చెట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని గౌడ కులస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఈ విషయంపై తక్షణమే స్పందించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎక్సైజ్ సీఐకి నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. గౌడ కులస్థుల జీవనాధారమైన తాటి, ఈత చెట్లను ఇష్టారాజ్యంగా తొలగించే పద్ధతిని వెంటనే అరికట్టాలని ఆదేశించారు. చెట్ల విషయంలో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే తప్పనిసరిగా స్థానిక గౌడ సంఘం సభ్యులతో కలిసి మాట్లాడి, వారి అంగీకారంతోనే ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. అలా కాకుండా గీత కార్మికుల పొట్ట కొట్టే విధంగా ఎవరు చెట్లను తొలగించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు. ఈ సందర్భంగా కొత్త గుండ్లపల్లి గౌడ సంఘం సభ్యులకు "నేనున్నాను" అంటూ బీర్ల ఐలయ్య భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత వరకు పేద, మధ్యతరగతి ప్రజల పక్షానే పరిపాలన సాగుతుందని, బడుగు బలహీన వర్గాలకు అండగా తాను, తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటామని ఆయన తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే తక్షణ స్పందనతో తమ సమస్యకు పరిష్కారం లభించడంతో కొత్త గుండ్లపల్లి గౌడ కులస్థులు హర్షం వ్యక్తం చేశారు. తొలగిస్తున్న రియల్టర్ల ఆగడాలపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తీవ్రంగా స్పందించారు. గౌడ సంఘం నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ, కొందరు రియల్టర్లు మరియు బ్రోకర్లు ఎక్సైజ్ అధికారుల సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా చెట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని గౌడ కులస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై తక్షణమే స్పందించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎక్సైజ్ సీఐకి నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. గౌడ కులస్థుల జీవనాధారమైన తాటి, ఈత చెట్లను ఇష్టారాజ్యంగా తొలగించే పద్ధతిని వెంటనే అరికట్టాలని ఆదేశించారు. చెట్ల విషయంలో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే తప్పనిసరిగా స్థానిక గౌడ సంఘం సభ్యులతో కలిసి మాట్లాడి, వారి అంగీకారంతోనే ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. అలా కాకుండా గీత కార్మికుల పొట్ట కొట్టే విధంగా ఎవరు చెట్లను తొలగించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు. ?ఈ సందర్భంగా కొత్త గుండ్లపల్లి గౌడ సంఘం సభ్యులకు "నేనున్నాను" అంటూ బీర్ల ఐలయ్య భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత వరకు పేద, మధ్యతరగతి ప్రజల పక్షానే పరిపాలన సాగుతుందని, బడుగు బలహీన వర్గాలకు అండగా తాను, తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటామని ఆయన తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే తక్షణ స్పందనతో తమ సమస్యకు పరిష్కారం లభించడంతో కొత్త గుండ్లపల్లి గౌడ కులస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి కుటుంబం ఇందిరా బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి-ఎంపీడీవో సాయన్న



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, నవంబర్ 18: కామారెడ్డి పిట్లం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలో ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీడీవో సాయన్న తెలిపారు. గత ప్రభుత్వంలో అమలైన రైతు బీమా కేవలం రైతులకే పరిమితమై ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం ప్రతి కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించేలా ఈ పథకాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తులను సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయాల్లో లేదా ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీకి వాసవి చిరు వ్యాపార సంఘం ఏర్పాట్లు



ఖమ్మం, 18 నవంబర్ (ఇది కద నిజం): నిరుపేదలకు చేయూతనందించే లక్ష్యంతో వాసవి చిరు వ్యాపార సంఘం ఆధ్వర్యంలో త్వరలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సేవా కార్యక్రమానికి వనమా ట్రస్ట్ అధినేత వనమా సూరి 15 దుప్పట్లను విరాళంగా అందజేశారు. ఈ మేరకు సంఘం అధ్యక్షులు మిట్టపల్లి రవికి దుప్పట్లను అందించారు. రానున్న రోజుల్లో వీటిని పేదలకు పంపిణీ చేయనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్యవైశ్య మహాసభ మాజీ ఉపాధ్యక్షులు అనిల్, ఆర్యవైశ్య నాయకులు విన్నమూరి సుబ్బారావు, కొంకిమళ్ళ మృత్యుంజయరావు, స్వాతి హాస్పిటల్, వినాయక హాస్పిటల్ అధినేత పసుమర్తి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు మిట్టపల్లి రవి మాట్లాడుతూ, నిరుపేదలకు సహాయం అందించేందుకు ముందుకొచ్చి 15 దుప్పట్లు అందించిన వనమా సూరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సేవే లక్ష్యంగా వాసవి చిరు వ్యాపార సంఘం ముందుకు సాగడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

ఇంటింటికి రూ. 5లక్షల ఇందిరమ్మ బీమా

సీఎం చేతుల మీదుగా నేటి నుండి ప్రారంభం

దేశానికి ఆదర్శంగా బీమా పథకం

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రామచంద్రునాయక్



మరిపెడ, 18 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సుభిక్షమైన పాలనలో మరో మైలురాయి ఇంటింటికి ఇందిరమ్మ బీమా పథకం అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రు నాయక్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జన్మదినం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇంటి పెద్ద అకారణంగా కాలం చేస్తే కుటుంబం దిక్కులేనిది కాకుండా ఉండకూడదన్న సంకల్పంతో బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ బీమా ద్వారా రూ. 5,00000 అందించనుందని ఆయన స్పష్టం చేశారు. 18 నుండి 59; ఏండ్ల వయసు కలిగిన వారికి ఈ పథకం వర్తించనుందని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ బీమా పథకం విస్తృతమైన ప్రచారం కల్పించి అన్ని వర్గాల కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. పార్టీలకు అతీతంగా ఈ పథకం అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

నేడు భాజపా రాష్ట్ర ధార్మిక సెల్ ఆధ్వర్యంలో సమావేశం



నర్సింహులపేట, 18 నవంబర్ (ఇది కద నిజం): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో జరిగే భాజపా ఎండోమెంట్ ధార్మిక సెల్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజ్జుల సూర్యప్రకాష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి భాజపా పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 19-11-2026



చెక్ బౌన్స్ బండ్లకు జైలు!

టాలీవుడ్ ప్రొడ్యూసర్, నటుడు బండ్ల గణేష్ కు ఊహించని షాక్ తగిలింది. చెక్ బౌన్స్ కేసు లో ఆయనకు ఒంగోలు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. అలాగే రూ. 95 లక్షల జరిమానా విధించింది. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి బండ్ల గణేష్ ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో బాధితుడు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు ఆయనకు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ. 95 లక్షల జరిమానా విధించింది. జరిమానా మొత్తం తో పాటు కేసు విచారణ నిమిత్తం బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేష్ భరించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కాగా, గతంలోనూ పలు చెక్ బౌన్స్ కేసుల్లో బండ్ల గణేశ్‌కు న్యాయస్థానాలు జైలు శిక్షలు విధించగా, ఆయన అప్పీల్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. తాజాగా ఒంగోలు కోర్టు తీర్పు టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



మరోసారి చిరు లీక్స్

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా ‘కాకా’. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రియమణి, నివేదా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను, మురళీ శర్మ, అనురాగ్ కశ్యప్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ‘వాల్తేరు వీరయ్య’ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత చిరు, బాబీ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో.. ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.

కాకా సినిమాలో చిరంజీవి కూతురి పాత్రలో మలయాళ నటి అనస్వర రాజన్ నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమాలో అనస్వర పోషిస్తున్న పాత్ర గురించి చిరు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ‘ఇట్లు అర్జున’ సినిమా సక్సెస్ మీట్‌లో మెగాస్టార్ కాకా మూవీలోని అసలు సస్పెన్స్ రివీల్ చేశారు. కాకాలో అనస్వర అద్భుతంగా నటించిందని ప్రశంసించిన చిరంజీవి.. ఆమె పాత్ర గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ‘అనస్వర.. నువ్వేమైనా నీ పాత్ర గురించి మాట్లాడతావా?. తను మాట్లాడదు.. మాట్లాడలేదు. మాట్లాడడం ఆమెకు నచ్చదు. నేను చెప్పిన ఈ లైన్‌ను మీరు ఇంటికి వెళ్లాక బాగా గుర్తుచేసుకుని ఆలోచించండి. అప్పుడు అసలు విషయం ఏంటో మీకే అర్థమవుతుంది’ అని చిరంజీవి అన్నారు.

కాకాలో మూగ అమ్మాయి పాత్రలో అనస్వర రాజన్ కనిపించనున్నట్లు చిరంజీవి పరోక్షంగా హింట్ ఇచ్చారు. చిరు వ్యాఖ్యల అనంతరం అనస్వర ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ కూడా అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ‘సర్.. మీరు సస్పెన్స్ లీక్ చేసేశారు’ అన్నట్లుగా ఆమె స్పందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదల తేదీ, స్టార్ కాస్ట్‌తో ఆసక్తి రేకెత్తిస్తున్న కాకా.. ఇప్పుడు అనస్వర పాత్ర చుట్టూ నెలకొన్న సస్పెన్స్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది. కాకాలో మూగ అమ్మాయి పాత్ర అనస్వర చేస్తున్నారని ఎప్పటి నుంచో వస్తోన్న వార్తలకు ఇప్పుడు మరింత బలం చేకూరింది. మొత్తానికి ‘చిరు లీక్స్’ ద్వారా కాకా సినిమాలో అసలు సస్పెన్స్ బయటపడింది. మెగాస్టార్ తన లీక్స్ ద్వారా ఎప్పటికప్పుడు అభిమానులను అలరిస్తున్న విషయం తెలిసిందే.



ఈషా-తరుణ్ పెళ్లి ఫిక్సా?

టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వస్తున్న క్రేజీ సీక్వెల్ ‘ఈ నగరానికి ఏమైంది రిపీట్’. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 19న థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో, తాజాగా ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర బృందం ఎంతో గ్రాండ్‌గా నిర్వహించింది. అయితే ఈ వేడుకలో పాల్గొన్న తరుణ్ భాస్కర్ తల్లి గీతా భాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొంతకాలంగా తరుణ్ భాస్కర్, హీరోయిన్ ఈషా రెబ్బా రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనని ఆమె స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా తమ కుటుంబం, ముఖ్యంగా తరుణ్ భాస్కర్ ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ఈ రెండేళ్ల కాలంలో తరుణ్ ఎన్నో ఒడుదుడుకులు చూశాడని, కోర్టు కేసులు, కొత్త ఇల్లు కట్టడం వంటి అనేక సమస్యలతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని ఆమె తెలిపారు. సినిమా పనుల వల్ల అసలు ఇంటికే రాని రోజులు కూడా చాలా ఉన్నాయని చెప్పారు. అయితే అలాంటి కష్టసమయాల్లో, అర్ధరాత్రి 2 గంటలకు, తెల్లవారుజామున 4 గంటలకు తరుణ్ ఇంటికి వచ్చినప్పుడు అతనికి ప్రేమగా భోజనం పెట్టడానికి ఒక మంచి సోల్‌మేట్ దొరికిందని గీతా భాస్కర్ వెల్లడించారు. ఆమె మరెవరో కాదని, మనందరం ఎప్పటినుంచో అనుకుంటున్న ఈషా రెబ్బానే అని ఆమె ఓపెన్‌గా చెప్పేశారు. ఈషా తరుణ్‌కు కేవలం ఒక మంచి స్నేహితురాలు మాత్రమే కాదని, ఒక అద్భుతమైన సోల్‌మేట్ అని ప్రశంసించారు. ఈషా అందించిన అండదండలు, ప్రోత్సాహం వల్లే తరుణ్ ఈ సినిమాను విజయవంతంగా పూర్తి చేయగలిగాడని, ఆమె రూపంలో తన కొడుకుకు జీవితాంతం తోడుండే మంచి వ్యక్తి దొరికిందని గీతా భాస్కర్ సంతోషం వ్యక్తం చేశారు. తల్లి స్వయంగా ఇలా పబ్లిక్ వేదికపై ఈషా గురించి గొప్పగా చెప్పడంతో, వీరిద్దరూ త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం మొదలైంది.



మళ్లీ విలన్‌గా..?

టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ త్వరలో మరోసారి విలన్‌గా కనిపించబోతున్నారనే వార్త సోషల్ మీడియాలో తెగ హల్చల్ చేస్తోంది. కెరీర్ మొదట్లో జయం, నిజం, వర్షం వంటి చిత్రాలలో తన అద్భుతమైన విలనిజంతో ప్రేక్షకులను భయపెట్టిన గోపీచంద్, ఆ తర్వాత హీరోగా మారి వరుస సినిమాలు చేశారు. అయితే ఇప్పుడు చాలా కాలం తర్వాత ఆయన మళ్లీ తన పాత బాట పట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అది కూడా ఏకంగా కోలీవుడ్ స్టార్ హీరో సూర్య సినిమాలో ఒక పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది.

సూర్య తన 48వ సినిమాను దాదాపు ముగించి.. ఇప్పుడు తన 49వ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టారు. ఈ చిత్రానికి ‘మండాడి’ ఫేమ్ మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. సూర్య కోసం ఆయన ఒక పర్ఫెక్ట్ మాస్ కథను సిద్ధం చేశారట. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా రాకపోయినా, ఇందులో నటించబోయే నటీనటుల పేర్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఈ చిత్రంలో సూర్యను ఢీకొట్టే పవర్‌ఫుల్ విలన్ పాత్ర కోసం టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. గోపీచంద్ లాంటి స్ట్రాంగ్ క్యారెక్టర్ ఉన్న హీరో, సూర్య లాంటి స్టార్‌తో తలపడితే థియేటర్లలో రచ్చ మామూలుగా ఉండదని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్లైమాక్స్‌లో కమల్ సర్‌ప్రైజ్!

తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం ‘సేయోన్’ పై అనౌన్స్‌మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘అమరన్’ తర్వాత మరోసారి కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో శివకార్తికేయన్ జతకట్టారు. దర్శకుడు శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శివకార్తికేయన్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మధురై ప్రాంతంలోని కరుమత్తూర్ వీరమాండి ఆలయంలో జరిగే మాసి కలరి ఉత్సవం నేపథ్యంలో కథ సాగనున్నట్లు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాల శరవణన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించి ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వార్త కోలీవుడ్‌లో చక్కర్లు కొడుతోంది. సినిమా క్లైమాక్స్‌లో స్వయంగా కమల్ హాసన్ అతిథి పాత్రలో కనిపించనున్నారట. అంతేకాకుండా తన కెరీర్‌లో ఐకానిక్‌గా నిలిచిన ‘విరుమాండి’ గెటప్‌లో కొన్ని క్షణాలు కనిపించనున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే ఈ అతిథి పాత్రపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉండగా.. ఇదే నిజమైతే థియేటర్లలో అభిమానులకు గూస్‌బంప్స్ రావడం ఖాయం.





తాత టైటిల్‌తో తారక్ మ్యాజిక్!

తన తాత ఎన్టీఆర్ నటించిన ఆల్‌టైమ్ క్లాసిక్ ‘లవకుశ’ టైటిల్ కలిసొచ్చేలా ‘జైలవకుశ’ సినిమా చేసి బ్లాక్‌బస్టర్ అందుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. ఇప్పుడు ఆ ఫీట్‌ని రిపీట్ చేస్తూ, మళ్లీ తాత ఎన్టీఆర్ టైటిల్ కలిసొచ్చేలా మరో సినిమా చేయనున్నారట తారక్. ఆల్‌టైమ్ క్లాసిక్ ‘దానవీరశూరకర్ణ’ టైటిల్ కలిసొచ్చేలా.. ‘దానవీరశూర’ పేరుతో తారక్ సినిమా చేయనున్నట్లు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది.

ప్రస్తుతం ఎన్టీఆర్ ‘డ్రాగన్’ సినిమా చేస్తూ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత ఆయన అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఆ సినిమాకే ‘దానవీరశూర’ టైటిల్ అనుకుంటున్నారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివున్నది.